క్లుప్తంగా

10న ఆలయ హుండీ లెక్కింపు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి. శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

తురకపాలెం సొసైటీ చైర్మన్ రాజీనామా



గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం గ్రామంలోని రైతు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దుగ్గింపూడి భూపాల్‌రెడ్డి శనివారం తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. చైర్మన్‌గా రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. పదవీ కాలం ఇంకా ఉన్నప్పటికి తానే రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే బాలిక అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి మహేష్ కుమార్ తెలిపారు. నారాకోడూరులోని మిల్లులో ఓ కుటుంబం రెండేళ్లుగా కార్మికులుగా పనిచేస్తోంది. ఆ కుటుంబంలోని దంపతులకు ఓ కుమార్తె (16) ఉంది. ఈ నెల 5వ తేదీ అర్ధ రాత్రి సమయంలో వారు నివసిస్తున్న మిల్లు కార్వర్స్ నుంచి ఆమె అదృశ్యమైంది. స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడుగా పనిచేసే యువకుడు జగదీష్ ఖండే ఆ బాలికకు మాయమాటలు చెప్పి అపహరించుకుపోయి ఉంటాడని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో వెండి పాదుకలు చోరీ



తాడికొండ: తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వెండి పాదుకలను చోరీ చేశారు. ఈ చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శైవక్షేత్రానికి చేరుకొని ఘటనపై పీఠాధిపతి శ్రీ శివస్వామిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకోవాలని సీఐను ఆదేశించారు. శ్రావణ్ కుమార్ వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మాచవరం : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చౌడబోయిన బొర్రయ్య(58) గత మూడేళ్లుగా తనకు ఉన్న 80 సెంట్ల స్థలంతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా పంట దిగుబడి రాక నష్టాల పాలయ్యాడు. సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేనన్న మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి కొడుకు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతి

ముప్పాళ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నార్నెపాడు గ్రామానికి చెందిన మేరిగ రవిబాబు (30)కు చిలకలూరిపేటకు చెందిన రజినితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగు సంవత్సరాల పాప ఉంది. అయితే కుటుంబ కలహాలతో రెండేళ్ల క్రితం రజిని తన పుట్టింటికి వెళ్లిపోయింది.తన భార్య తనతో ఉండటం లేదనే మనస్తాపంతో రవిబాబు గత నెల 26న మద్యం సేవించి, తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న రవిబాబును గమనించిన బంధువులు అతడిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రవిబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న రవిబాబు శనివారం సాయంత్రం మృతి చెందాడు. కేసును ఎస్‌ఐ హజరతయ్య దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాలలు ప్రారంభం కాగా, 12వ తేదీ నుంచి పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతున్నాయని తెలిపారు.

పార్కులో సమస్యల పాగా

- మౌలిక సదుపాయాలూ కరవే
- పట్టించుకోని అధికారులు



శుభ్రతకు నోచుకోని పార్కు

పొన్నూరు : ప్రజలు సేద తీరడానికి ఏర్పాటు చేసిన పార్కులు సమస్యలకు నెలవుగా మారుతున్నాయి. పట్టణం 6వ వార్డులోని మున్సిపల్ పార్కు అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులకు అసౌకర్యంగా మారింది. వివిధ పన్నుల రూపంలో మున్సిపాలిటీకి ఆదాయ వనరులు సమకూరుతున్నా ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఏర్పాటు చేసిన పార్కును ఏళ్ల తరబడి పట్టించుకునే వారు లేకపోవడంతో పలు సమస్యలు తిష్ట వేశాయి. పార్కు పరిసరాల్లో కంపచెట్లు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సేవించేందుకు అడ్డాగా మలుచుకుంటున్నారని చెబుతున్నారు. బల్లలు విరిగిపోవడంతో కూర్చునేందుకు వీలు లేకుండా పోయింది. ప్రహరీ శిథిలావస్థకు చేరి కూలేలా ఉంది. గతంలో జరిగిన అభివృద్ధే తప్ప.. నేడు పార్కు ఆలనాపాలనా కరవైందని వెల్లడించారు. ఇది చెప్పుకోవడానికే పార్కు అని, కానీ సౌకర్యాలు మాత్రం శూన్యమని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడిందని తెలిపారు.

పరిసరాలలో పేరుకుపోయిన వ్యర్థాలు

గత పాలకులు ప్రజల సౌకర్యార్థం విలువైన స్థలాలను పార్కులకు కేటాయించి రూ.లక్షల నిధులతో ర్కుగా తీర్చిదిద్దినా ప్రయోజనం లేకుండా పోయింది. పారిశుద్ధ్యం కొరవడి ప్రహరీ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయాయి. పార్కులో ఎక్కడా చెత్త కుండా కూడా ఏర్పాటు చేయలేదు. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. సౌకర్యాలు లేనికారణంగా పార్కుకు వచ్చే వారి సంఖ్య క్రమేపి తగ్గుముఖం పట్టింది. పార్కు పరిసరాల్లో నడవటానికి వీలు లేకుండాపోయింది. గుంతలు ఏర్పడి ఇబ్బందికరంగా మారింది. దీంతో సీనియర్ సిటిజన్లు పార్కులో నడిచేందుకు కూడా జంకుతున్నారు. అంతేగాక వానొస్తే నీరు బయటికి వెళ్లే మార్గం లేక నెలల తరబడి నిల్వ ఉంటోంది.

ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం



పార్కును అభివృద్ధి చేయడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఏళ్ల తరబడి పార్కును పట్టించుకున్న దాఖలాలు లేవు. సరైన సౌకర్యాలు లేక పార్కుకు ఎవరూ రావడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇప్పటికైనా సౌకర్యాలు మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. – విజయరాణి, స్థానికురాలు

ప్లాస్టిక్ భూతం... మనుగడకు విఘాతం

- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- నిప్పు పెట్టడంతో మరింత ముప్పు



రోడ్డు పక్కన పడవేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

తాడేపల్లిరూరల్ : పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం మింగేస్తోంది. భవిష్యత్తు తరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. దాన్ని ఆపడం మన చేతుల్లో ఉన్నా, పట్టించుకోకపోవడం భారీ అనర్థానికి కారణం కానుంది. ఆస్తి, సంపదను మన పిల్లలకు ఇస్తున్నట్లే, వారు చక్కగా జీవించడానికి అనువైన పర్యావరణాన్ని కూడా అందించాలి. ఇది అందరికీ తెలిసినప్పటికీ ప్లాస్టిక్ నియంత్రణ, నిషేధం ప్రచారానికే పరిమితం అవుతోంది. నిర్ణీత మైక్రాన్ల కంటే తక్కువగా ఉండే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడానికి వీల్లేదంటూ చట్టాలను చేసినప్పటికీ కూడా వాటిని అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోంది.

నివాస ప్రాంతాల నుండి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్నాయి. అక్కడ వాటికి నిప్పు పెట్టడంతో వాతావరణం కలుషితం అవుతోంది.

నీరుగారిన సంకల్పం

ఆవాస ప్రాంతాల నుండి పోగయ్యే చెత్తతోనే పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని గుర్తించి వాటిని పర్యావరణ హితంగా డీ కంపోజ్ చేసేందుకు సమాయత్తమయ్యారు. ఇందుకోసం ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తగా సేకరించి, దాని నుండి ఎరువులను తయారు చేయాలని సంకల్పించారు. ఇందులో వచ్చే ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి పునర్వినియోగ వస్తువులుగా తయారు చేయాల్సి ఉంటుంది. ఇంత వరకు ప్రణాళిక బాగానే ఉంది కానీ దానిని అమలు చేస్తున్న దాఖలాలు కన్పించడం లేదు.

నీటి పారుదలకు అడ్డంకులు

మంగళగిరి నియోజకవర్గంలో బకింగ్‌హామ్ కెనాల్ మరియు కృష్ణానదికి అనుబంధంగా వున్న పిల్లకాలువన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీంతో సాగు, మురుగునీరు సక్రమంగా ముందుకు కదలక అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఒకవేళ కాలువలోని నీటిని నేరుగా పొలాలకు పారిస్తే వాటితో పాటు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా పొలాల్లోకి చేరుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ప్రచారం చేసినా ..

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగానే ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రావడం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఒక ఎత్తు అయితే, వాటిని వాడిన తరువాత డంపింగ్ యార్డులకు చేర్చి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.

నియంత్రణ అవసరం...

ప్రజాజీవితంలో భాగంగా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అత్యవసర పరిస్థితి ఉందని పలువురు పర్యావరణ మేధావులు అంటున్నారు. వినియోగదారులు సైతం అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండడమే దీనికి సరైన పరిష్కార మార్గంగా సూచిస్తున్నారు. ఈ తరహా మార్పు రాకపోతే మాత్రం ప్లాస్టిక్‌తో మరిన్ని భారీ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

కఠిన చర్యలు....

ప్లాస్టిక్ వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడు దాని వినియోగం తగ్గుతుంది. మార్కెట్లను వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు ముంచెత్తుతున్నాయి. వినియోగానికి సౌకర్యవంతంగా ఉండడంతో ప్రజలు వీటివైపు మొగ్గుచూపుతున్నారు. అమితంగా వచ్చే ప్రమాదాన్ని మాత్రం గుర్తించడం లేదు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ కొండలు

మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీగా ఉండే ప్రాంతాలన్నీ డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. ఇవన్నీ ప్లాస్టిక్ కొండలను తలపిస్తున్నాయి. ఇరిగేషన్ కాలువ గట్టును కూడా ఇదేవిధంగా వినియోగిస్తున్నారు. నివాస గృహాల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లోకి చేర్చి, నిప్పు పెడుతున్నారు. దీనివల్ల అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ తదితర వస్తువులు సైతం కాలిపోయి గాలి కాలుష్యం పెరిగి పోతోంది. పాలీ బ్యాగులతో పాటు ప్లాస్టిక్ మెటీరియల్‌ను కూడా నేరుగా డంపింగ్ యార్డుల్లోనే పడేస్తున్నారు. వీటిలో శానిటరీ నాప్‌కిన్స్ మొదలుకుని ఆసుపత్రి వ్యర్థాల వరకూ ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టంగా అలుముకున్న పొగ

ఎటువంటి పర్యవేక్షణ, నియంత్రణ లేకుండా ఇలా డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ఆ ప్రదేశాల్లో భూమి, నీరు, గాలి కలుషితం అవుతోంది.

రైతు శ్రేయస్సుకు ఎన్‌జీ రంగా కృషి



రంగా సమాధికి నివాళి అర్పించిన కమిటీ నాయకులు

పొన్నూరు : రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయులు ఆచార్య ఎన్‌జీ రంగా అని రంగా కమిటీ నాయకులు కొనియాడారు. పట్టణంలో శనివారం ఎన్‌జీ రంగా 29వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం జీబీసీ రోడ్డులోని రంగా సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. కమిటీ నాయకులు వెలగా సుబ్బారావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం కృషి చేసిన ఎన్‌జీ రంగాను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో కొసరాజు వెంకట రాయుడు, గోగినేని వెంకటేశ్వరరావు, బండ్లమూడి నాగేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, ఆకుల జానకిబాబు, గురుబాలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయుడికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



అభిషేకాలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో జీవధ్వజ ప్రతిష్ఠ 7వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణాచార్యులు, చంద్రాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముఖమండపంలో విశ్వక్సేన తదితర పూజలు చేశారు. సాయంత్రం పరవస్తు హనుమాన్‌సూరి బృంద సభ్యులచే హనుమాన్ చాలీసా పారాయణం, కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యానీ గ్రేస్

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 294 మందికి వైద్యురాలు యానీ గ్రేస్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ఇంటి చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీరు వడకట్టి తాగాలని చెప్పారు. మురుగు కాలవలలో నీటి పారుదల సక్రమంగా ఉంచుకోవాలని, తొట్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దాని ద్వారా మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమయ్యే దోమల ఉత్పత్తి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ కె.సుదర్శనరాజు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం ఏసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో రహదారుల వెంట కంప తొలగింపు



జేసీబీలతో రోడ్ల వెంబడి కంపను తొలగిస్తున్న సీఆర్డీయే సిబ్బంది

తాడికొండ: తుళ్లూరు మండలంలో ప్రధాన రహదారుల వెంట పెరిగిన పిచ్చి కంపచెట్లు తొలగించే పనులను సీఆర్డీయే ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు, తుళ్ళూరు నుంచి హైకోర్టు వెళ్ళే రహదారి, రాయపూడి నుంచి హైకోర్టుకు వెళ్ళే ప్రధాన రహదారితోపాటు పలు గ్రామాలకు వెళ్ళే కనెక్టివిటీ రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి కంప తొలగింపు పనులను జేసీబీల సాయంతో చేస్తున్నారు. సీఆర్డీయే అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పనులకు వర్షాకాలం నేపథ్యంలో చిన్నపాటి ఆటంకాలు ఉన్నప్పటికీ రేయింబవళ్లు జరుగుతున్నాయి.

ఐదు గ్రామాల్లో భద్రత కట్టుదిట్టం

ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు



మంచికల్లులో గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు

రెంటచింతల: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు తెలిపారు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు తుమ్మకోట, రెంటాల, పాలువాయి గేటు, మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాల్లో ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం పికెట్ ఏర్పాటు చేసిన గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ఈ గ్రామాల్లో ఏలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ప్రజలందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. రౌడీ షీట్ ఉన్న వారి పిల్లలు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల్లో చాలా ఇబ్బంది పడతారని అర్థమయ్యేలా వివరించారు. ఆవేశంతో చేసే పనులు మంచి కన్నా చెడు జరగడానికి అవకాశం ఎక్కువ ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి విద్వేష పూరిత సందేశాలు, ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం 110 మంది ప్రత్యేక దళాలు, మరో 30 మంది ఏఆర్ పోలీసు సిబ్బందితో 5 గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఘనంగా శనీశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): రెండు తెలుగురాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా ఆగమన శాస్త్ర విధి విధానాలతో నిర్మాణం జరిగి వైభవంగా పూజలు అందుకుంటున్న మహిమాన్విత శ్రీ జేష్టలక్ష్మీ సమేత శ్రీ శనీశ్వర స్వామి దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం అమ్మవారి ఊరేగింపు కనులపండుగా చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు 24 గంటల పాటు అఖండ శివ ఏకనామ భజన నిర్వహిస్తున్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు జానపాటి పరమేశ్వరరావు, కూరాకుల రాము, రావెళ్ల శ్రీనివాసరావు, పేరూరు సాయికుమార్, అట్లూరి ప్రసాద్, మల్లికార్జున, శ్రీకాంత్, రఘురాం, వెంకటలక్ష్మయ్య, కాశీనాధ్, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దొంగల బారి నుంచి పంటలను కాపాడాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

శావల్యాపురం: పొలాల్లో ఆరబెట్టిన పంటలను దొంగల బారి నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. మండలంలోని పోట్లూరు గ్రామంలోని గడిపూడి ప్రసాద్ అనే రైతు నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగు చేయగా ఆ పొలంలో పండిన పొగాకును తాళ్లకు గుచ్చి పొలంలో వేసిన పాకాలో తాళ్లను కట్టి ఉండగా గురువారం రాత్రి సుమారు 5 నుంచి 6 క్వింటాళ్ల పొగాకు తాళ్లను దొంగలు దోచుకెళ్లారు. ఉదయాన్నే వచ్చిన ప్రసాద్ పొలంలో చూడగా పొగాకు తాళ్ల కనిపించలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న రాము సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి రైతుకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, గ్రామరైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో చోరీ



నరసరావుపేట టౌన్: అయ్యప్పస్వామి ఆలయంలో వెండి వస్తువులు అపహరించుకువెళ్లిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం తెల్లవారు జామున ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. ఆలయంలోని వెండి శఠగోపం, ప్లేటు, తీర్థం గిన్నెలను అపహరించుకు వెళ్లాడు. చోరీ చేసిన దృశ్యాలను సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ సీఐ మల్లిఖార్జునరావు, ఎస్‌ఐ రోశయ్య సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లభ్యమైన సీసీ పుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఇంటిలో పడిన బాలు గురించి అడిగితే దాడి

నరసరావుపేట: ఇంట్లో పడిన క్రికెట్ బాలును గురించి అడిగినందుకు కోలా నరేష్ బాబు, శ్రీలక్ష్మి, ఏ.వెంకటసుబ్బారావులపై దాడిచేసిన నిందితులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు కోరారు. జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి డి.రామకృష్ణ, బాధితులు శనివారం ఒక ప్రకటన ద్వారా సంఘటన వివరాలను తెలియచేశారు. బరంపేటలోని ఇస్కాన్ టెంపుల్ వెనుక కూరగాయల బజారులో బాధితులు, దాడిచేసిన వ్యక్తులు ఎదురెదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఈనెల నాల్గో తేదీన క్రికెట్ బాలు మా ఇంట్లో పడింది ఏమిటని ప్రశ్నించినందుకు ఎదురు ఇంటిలో నివాసం ఉండే పసుపులేటి ప్రసాద్, ఆర్.కొండ, బాబి, కళ్యాణ్, సింగరాజు శివప్రసాద్ ఇంటిమీద దాడిచేసి తీవ్రంగా కొట్టారన్నారు. బాధితులు వెంటనే స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స పొందారన్నారు. హాస్పిటల్ డ్యూటీ డాక్టర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి తెలియచేయడంతో పోలీసులు వచ్చి బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిందితులు తాము అధికార జనసేన, టీడీపీ పార్టీల వాళ్లమని బాధితులను బెదిరిస్తున్నారని, పై అధికారులు వెంటనే జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.